క్లుప్తంగా

ఎంపీడీవో, ఈవోపీఆర్డీ బాధ్యతల స్వీకరణ

వీరవాసరం: వీరవాసరం ఎంపీడీవోగా కే కిరణ్ కుమార్, ఈవోపీఆర్డీగా ఏఎస్ ఆర్‌హెచ్ కొండలరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పురోభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలంతా సహకరించాలన్నారు. ఉద్యోగ బాధ్యతను స్వీకరించిన ఎంపీడీవో, ఈఓపీఆర్డీని గ్రామ కార్యదర్శులు, మండల సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు.

వ్యవసాయ విద్యలో సర్టిఫికెట్ కోర్సులు

ఉండి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి దూర విద్యాకేంద్రాన్ని ఏర్పాటు చేశారని దాని ద్వారా సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఉండి మండల ఎన్నార్పీ అగ్రహారం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు తెలిపారు. రైతులు, మహిళలు, యువత వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి కోసం రెండు నెలలు నిర్వహించే కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు యూనివర్సిటీ వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్‌ఏయు. ఏసీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి కోర్సుకు రూ.1,500 ఫీజు చెల్లించాలన్నారు. వివరాల కోసం సెల్: 8008788776, 8309626619 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఏపీఐఐసీ చైర్మన్‌గా మంతెన రామరాజు బాధ్యతల స్వీకరణ

పాలకోడేరు: ఉండి మాజీ ఎమ్మెల్యే పశ్చిమగోదారి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మంతెన రామరాజు (కలవపూడి రాంబాబు) శనివారం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) చైర్మన్‌గా మంగళగిరిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రామరాజుకు ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అభినందనలు తెలిపారు పాలకోడేరు మండలం టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, దొంగ కృష్ణ, ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ జుత్తిగ నాగరాజు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలి

భీమవరం: స్థానిక డి.ఎన్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్‌కి చెందిన టీ.ఆర్ ఇన్నోవేటివ్ టెక్ సొల్యూషన్స్ ద్వారా మూడు రోజుల ఆండ్రాయిడ్ వర్క్ షాప్ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.ఎస్ వర్మ, డీన్ అడ్మిన్ డాక్టర్. ఎ.రామ్మూర్తి మాట్లాడుతూ ఆండ్రాయిడ్ ప్రోగ్రామ్ వర్క్ షాప్‌తో విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంలో వినూత్న మార్పులు వస్తున్నాయని వీటిపై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ ఆండ్రాయిడ్ వర్క్ షాప్ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు బహూకరించారు. కార్యక్రమంలో కె.ఎస్.ఆర్ ప్రసాద్, ఎల్ బుజ్జిబాబు, బి. నందన్ కుమార్, ఈద జాషువా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలు అభినందనీయం

భీమవరం(ప్రకాశం చౌక్): సప్తనిధి లిమిటెడ్ (క్వాజీ బ్యాంకింగ్) 5వ వార్షికోత్సవం సందర్భంగా భీమవరం ఒకటో శాఖలో వివిధ సామజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మ్యాక్సీ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం, ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భీమవరం తహసీల్దార్ వి.రాంబాబు మాట్లాడుతూ సప్తనిధి బ్యాంకు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో కొల్లినాయుడు, మార్కెటింగ్ హెడ్ ఐ.వి.సురేష్, హెచ్.ఆర్ అండ్ అడ్మిన్ కొల్లి దుర్గా శివరాం, జనరల్ మేనేజర్ పి.వి.కిషోర్, చీఫ్ అడ్వైజర్ కె.ఎస్.ఎన్.మూర్తి వీఆర్వో రాజమణి, దాయన చంద్రాజీ, చెరుకువాడ రంగసాయి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీల సీజ్

భీమవరం: అక్రమంగా ఇసుకతరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు భీమవరం టుటౌన్ సీఐ జి కాళీచరణ్ చెప్పారు. శనివారం పోతవరం, పట్టిపాలెం ప్రాంతాల నుంచి భీమవరం వస్తున్న రెండు లారీలను తనిఖీ చేయగా వారి వద్ద ఎటువంటి రశీదులు లేకపోవడంతో లారీలలోని 10 టన్నుల ఇసుక, వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

18వ వార్డులో కమిషనర్ పర్యటన

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణం 18 వార్డులో శనివారం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి పర్యటించారు. వార్డులో లోతట్టు ప్రాంతాలైన రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. చెత్త సేకరించే వాహనాలకు తడి చెత్త- పొడి చెత్త విడివిడిగా అందించేలాగా చర్యలు తీసుకోవాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని సంబంధిత ప్లానింగ్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు.

పడకేసిన ప్రగతి

- భీమవరం మున్సిపాలిటీలో నాలుగు నెలలుగా అభివృద్ధి శూన్యం
- పట్టణంలో వైఎస్సార్‌సీపీ హయాంలో రోడ్ల నిర్మాణం
- మిగిలిన రోడ్లు నేడు అధ్వానం
- ఆక్రమణలు తొలగింపునకు అడ్డుకట్ట
- పట్టించుకునే నాథుడు లేడు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో భీమవరం మున్సిపాలిటీ పరిధిలో పరుగులు పెట్టిన అభివృద్ధి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పడకేసిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి శూన్యంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. నాలుగు నెలలగా భీమవరం పట్టణంలో ఒక అభివృద్ధి పని చేపట్టలేదు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు పాటు రోడ్లు, డ్రెయిన్లు దాదాపు 75 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తి చేశారు. మిలిగిన 25 శాతం పనుల్లో కొన్ని రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేయవలసి ఉంది. అధ్వానంగా ఉన్న రోడ్లు, వర్షాలు కురిసినప్పుడు డ్రెయిన్ల నుంచి మురుగునీరు పొంగి పొర్లడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయం ఉండి కూడా పనులు చేయడంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మున్సిపాలిటీ అభివృద్ధి పనులను పట్టించుకోవడం లేదు. భీమవరంలో ఉండే కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఇంటికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నా ఆయన పట్టించుకోవడం లేదు. కేవలం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడంలో కేంద్ర మంత్రి బిజీగా ఉంటున్నారు. ఓట్లు వేసి గెలిపించిన భీమవరం ప్రజలు తాగునీటి సమస్య, అధ్వానంగా ఉన్న రోడ్లతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు.

అభివృద్ధియే లక్ష్యంగా పనిచేసిన గ్రంధి శ్రీనివాస్

మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భీమవరం అభివృద్ధే లక్ష్యంగా ఐదేళ్లపాటు నిరంతరం కృషి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల నుంచి నాలుగు నెలల కాలంలో దాదాపు రూ.10 కోట్ల మేర పనులను భీమవరంలో ఆయన పూర్తి చేసి అదే ఒరవడిని కొనసాగించారు. సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేయించారు. గత టీడీపీ ప్రభుత్వంలో తీర్మానం చేసిన రోడ్లను కూడా ఆయన పూర్తి చేయించారు. పట్టణంలో దాదాపు 75 శాతం మేర సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేయించిన ఘనత గ్రంధి శ్రీనివాస్‌కు దక్కింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదటి నాలుగు నెలల కాలంలోనే సీసీ రోడ్లు, డ్రెయిన్లను అభివృద్ధి చేసిన తీరును భీమవరం ప్రజలు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

ఆక్రమణల తొలగింపునకు అడ్డుకట్ట

భీమవరం పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ కమిషనర్ అన్ని విధాల సిద్ధమైన తరుణంలో ఆక్రమణలు తొలగించడం కుదరదని స్థానిక ప్రజాప్రతినిధి, కూటమి ప్రభుత్వం నాయకులు అడ్డుకట్ట వేశారు. దాంతో ఆక్రమణలు తొలగింపు పనులు నిలిచిపోయాయి. భీమవరం మున్సిపాలిటీలో కూటమి నాయకులు ఒక పక్క అభివృద్ధి పనులు చేయడానికి సహకరించరు. మరోపక్క ఆక్రమణల తొలగింపును అడ్డకుంటున్నారని ప్రజలు అంటున్నారు.


గోతులతో అధ్వానంగా ఉన్న శ్రీరామపురం డీఎన్ఆర్ కళాశాల రోడ్డు


అధ్వానంగా తయారైన విస్సాకోడేరు లేవుట్‌కు వెళ్లే పైపుల చెరువు రోడ్డు

మహిళలకు సుస్థిరమైన జీవనోపాధి కల్పించాలి

భీమవరం (ప్రకాశం చౌక్): ఆర్థిక అవసరాలకు విదేశాలకు వలస వెళ్లే అల్పాదాయ వర్గాల మహిళలను గుర్తించి సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి మెప్మా అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి మెప్మా అధికారులతో సమావేశమై ఆ శాఖ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ చాలామంది మహిళలు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి మోసపోతున్నారని, వీటిని నిరోధించడానికి అల్పాదాయ వర్గాల మహిళలను గుర్తించి సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా ఏవో బి.రజనీకాంత్, ఐబీ అధికారి జి.పార్వతి, జిల్లాలోని సిటీ మిషన్ మేనేజ్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కి గాయాలు

ఆకివీడు: రాజులపేట సర్పంచ్ నల్లపురాజు రామరాజు రోడ్డు ప్రమాదంలో గాయాలై భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రాజులపేట నుంచి సిద్ధాపురం రోడ్డు మీదుగా ఆకివీడు రామరాజు మోటారు సైకిల్‌పై వస్తుండగా ఆకివీడు నుంచి సిద్దాపురం వైపు నంబరు ప్లేటు లేని ద్విచక్ర వాహనాన్ని ఓ వ్యక్తి అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు.

వ్యక్తిపై దాడి

పాలకోడేరు: పాత గొడవలు పురస్కరించుకుని ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైప గ్రామానికి చెందిన పరసా పాపారావు తాత వరసకు చెందిన గరగ శేషారావును పాత గొడవలను పురస్కరించుకుని ఆగస్టు 16వ తేదీ రాత్రి సిమెంట్ ఇటుక రాయితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ముద్దాయి పాపారావు అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. శనివారం పాపారావును అరెస్టు చేసి కోర్టులో హాజరపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎన్ హరిబాబు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

భీమవరం: భీమవరం పట్టణంలో శనివారం పేకాట స్థావరాలు మూతపడ్డాయి. కాళ్లమండలం పెదఅమిరంలోని పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేయడంతో భీమవరం పట్టణంలోని జూదరులు ఉలిక్కిపడ్డారు. గత ప్రభుత్వం క్లబ్‌ల్లో పేకాటను నిషేధించగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్లబ్‌ల్లో విచ్చలవిడిగా పేకాట నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులకు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టచెప్పినట్టు ప్రచారం జరిగింది. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలోని ఒక క్లబ్‌పై పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి జూదరులను అదుపులోనికి తీసుకున్నారు. పెదఅమిరంలోని ఒక నివాసంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేయడంతో పేకాట శిబిరాలను మూసివేశారు. క్లబ్‌లపై దాడులు తాత్కాలికమేనని ఎటువంటి ఇబ్బంది లేకుండా పైస్థాయిలో మాట్లాడతామని కూటమి నేతలు జూదరులకు భరోసా ఇస్తున్నట్లు తెలిసింది.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి

కాళ్ల: ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ కాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ధర్నా నిర్వహించారు. ధర్నాలో సీఐటీయూ కాళ్ల మండల అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఎన్నికై వంద రోజులు దాటినా ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక హామీ అమలు చేయకపోవడంతో నిర్మాణ కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఉచిత ఇసుక హామీ వంద రోజులు దాటినా అమలు చేయకపోవడంతో అనేక మంది భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు రాష్ట్రంలో లక్షలాదిమంది ఉపాధి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.


కాళ్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, నిర్మాణరంగ కార్మికులు

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మండల సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని కొత్త ప్రభుత్వం నిర్మాణ కార్మిక రంగాన్ని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కాళ్ల మండలం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, పుట్టబోతుల మధు వెంకటేశ్వరరావు, బాబి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తిరుమణి శ్రీను, కేవీపీఎస్ నాయకులు దాసి బాలయ్య, గరికి ముక్కల ఆజమ్మ పాల్గొన్నారు.

ఇసుకను అందుబాటులోకి తేవాలి

ఆకివీడు: ఇసుక అందుబాటులో లేక నిర్మాణ పనులు స్తంభించి పోయాయని పలువురు తాపీ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తాపీ పనివారల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. సంఘ అధ్యక్షుడు ధనరాజు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా తాపీ పనులు లేక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ గౌరవధ్యక్షుడు ఆర్వీవీ.సత్యనారాయణ, చిలకా సురేష్, పైలా రామారావు, గెద్దా పెద్దిరాజు, చిన్నారపు బాబి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం


సర్వోదయ మండలి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులుగా ఉండాలని, పిల్లలు ఏ రంగంలో రాణిస్తారో ముందుగా గుర్తించి వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల, పాఠశాల హైస్కూల్లోని 26 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గురువుల సేవలను సమాజం ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి, తహసీల్దార్ రవి రాంబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమ సమాజ స్థాపనకు కంకణ బద్ధులు కావాలని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ బీజేపీ యువ మోర్చ నాయకులు అరసవల్లి మణికంఠ వెంకటేష్ సౌజన్యంతో పట్టణంలోని 26 మంది ఉపాధ్యాయులను సత్కరించామని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, డాక్టర్ వీరయ్య, జీపీసీ శేఖర్ రాజు, పైడిరాజు ప్రభావతి, కే శ్రీనివాస్ తదితరులను ఈ సందర్భంగా సత్కరించారు. ఇందుకూరి ప్రసాద్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సత్కారం

భీమవరం: ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా భీమవరం గాంధీ కస్తూరిబా భవనంలో సర్వోదయ మండలి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు అధ్యక్షత వహించగా, మానవతా సంస్థ భీమవరం శాఖ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన వర్మ (పూనా రామం) ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి విద్యా ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. పదవీవిరమణ తర్వాత సమాజ సేవలందిస్తున్న అధ్యాపకులు కె.వి.సుబ్బరాజు, అల్లూరి నరసింహారాజు, చేకూరి ఝాన్సీ లక్ష్మి, కలిగొట్ల గోపాలశర్మను మహాత్మా గాంధీ స్ఫూర్తితో సర్వోదయ మండలి అవార్డులతో సత్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, కో చైర్మన్ కారుమూరి నరసింహ మూర్తి (బాబు), జీకెవివి ప్రసాద్, వేగేశ్న రామ్మూర్తి రాజు, అల్లు శ్రీనివాస్, ఎస్.ఎస్. రాజు, భూపతి రాజు ఆనంద స్వరూప వర్మ పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

వీరవాసరం: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వీరవాసరం మండలంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం వీరవాసములోని కనకదుర్గమ్మ ఆలయం, తోలేరులోని ప్రసన్న కనక దుర్గాదేవి ఆలయం, రాయకుదురు, మడుగు పోలవరం, నవుడూరు, అండలూరు, తోకలపూడి మత్స్యపురి, నందమూరి గరువు, చింతలకోటి గరువు, పెరికిపాలెం, దూసనపూడి, మత్స్యపురి పాలెం తదితర గ్రామాల్లో అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు.

ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూవేంకటేశ్వర స్వామి దేవస్థానం. శ్రీలక్ష్మి శరన్నవరాత్ర మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహిస్తున్నారు. 3వ రోజు శనివారం ధనలక్ష్మి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం శ్రీ చక్ర అభిషేకం, సామూహిక సహస్రనామ కుంకుమ పూజలు, సాయంత్రం అష్టోత్తర శతనామార్చన చేశారు. కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవార్లు

ఆకివీడు: అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. స్థానిక పెద్దింటి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ అలంకరణలో దర్శనమిచ్చారు. మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. గౌడ కార్పొరేషన్ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మేకా పార్వతి దంపతులు అమ్మవారికి పట్టు చీరను సమర్పించారు.


గాయత్రి దేవి అలంకరణలో మావుళ్లమ్మ


కాళ్ల: ధనలక్ష్మి అమ్మవారి అలంకరణలో అమ్మవారు


ఉండి : కొత్తపేటలో అన్నపూర్ణమ్మగా దుర్గమ్మ

అన్నపూర్ణమ్మగా దుర్గమ్మ

ఉండి: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో కనకదుర్గమ్మ అన్నపూర్ణమ్మగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో, మంటపాల్లో కుంకుమ పూజలు చేసారు. భజన, కోలాట బృందాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి.

గాయత్రి దేవీ నమో నమః

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారు నవరాత్రి మహోత్సవాల్లో శనివారం శ్రీగాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారంఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద విశాఖ పట్టణానికి చెందిన భాస్కర భట్ల సత్యప్రసాద్ శర్మ వేద సభ నిర్వహించారు. ఆలయ కమిషనర్ మహాలక్ష్మి నగేష్, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. గునుపూడి ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మవార్లు శనివారం గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నాచువారి సెంటర్‌లో ఒంటెద్దు బళ్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

మానసిక ప్రశాంతత పొందినవారు అదృష్టవంతులు

భీమవరం అర్బన్: ప్రపంచంలో అందరికన్నా అదృష్టవంతులు మానసిక ప్రశాంతత పొందినవారేనని కలెక్టర్ చదలవా నాగరాణి అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలో శనివారం సహజ యోగ ధ్యాన కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ ప్రత్యేక పూజలు కొనసాగున్నాయి. సహజయోగ ఏపీ మాజీ స్టేట్ కో ఆర్డినేటర్ బొల్లా పద్మావతి యోగా, సహజ యోగా ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆత్మసాక్షాత్కారం పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సహజయోగా లాంటి ధ్యాన కేంద్రాలు ప్రజలకు వరమని అన్నారు. అనంతరం గ్రామంలో డంపింగ్ యార్డు వల్ల ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ నాగరాణిని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కేంద్రం నిర్వాహకులు కె. కృష్ణంరాజు, సుబ్బరాజు, అప్పన హనుమంతరావు, సహజయోగులు పాల్గొన్నారు.

మోగల్లు ప్రజలకు తాగునీరు అందించండి

పాలకోడేరు: మోగల్లులో ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణం పంచాయతీ ద్వారా తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మోగల్లులో అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం గ్రామ శాఖ మహాసభ ఆ పార్టీ నాయకులు వీరవల్లి వేంకటేశ్వరరావు అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. తొలుత అరుణ పతాకాన్ని సీనియర్ నాయకులు కసిరెడ్డి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ గ్రామంలో కాలుష్యాన్ని అరికట్టాలని అన్నారు. ఆక్వా చెరువులు వలన కొత్త కాలని పూర్తిగా ముంపునకు గురవుతోందని తెలిపారు. ఆక్వా చెరువుల వ్యర్థాల కారణంగా అరుంధతి పేట పూర్తిగా ముంపునకు గురవుతోందని అన్నారు. గ్రామంలో ఉన్న రెండు దళిత పేటల్లో డ్రైనేజీలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, సీపీఎం గ్రామ కార్యదర్శి పాలా వెంకటస్వామి, నాయకులు గుత్తుల బాబురావు, గెద్దాడ వెంకటేశ్వరరావు, వీరవల్లి పవన్ నాగ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌వీ గోపాలన్

కనుల పండువగా దసరా విజయీభవ శోభాయాత్ర

భీమవరం: శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా విజయీభావ శోభాయాత్ర శనివారం స్థానిక శ్రీరాంపురం రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి భీమవరం పట్టణ వీధుల్లో వైభవంగా సాగింది. పెయింటర్స్ అండ్ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని సత్యనారాయణ, కార్యదర్శి పొన్నా రంగారావు, ఉపాధ్యక్షుడు జ్యోతుల మల్లికార్జునరావు, అసోసియేషన్ సహాయ కార్యదర్శి గండికోట వీరస్వామి, కోశాధికారి పనమట దుర్గారావు, ఆలయ అర్చకులు బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం, ప్రసాద్ మాట్లాడుతూ దసరా విజయీభావ శోభాయాత్ర అందరి ఇంటా విజయం చేకూరాలని, పూర్వీకులు ఈ సంప్రదాయాన్ని నెలకొల్పారని అన్నారు. చిన్నారులు విల్లంబులతో దసరా పద్యాలతో వీధుల్లో తిరుగుతూ మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడం ఒక శుభ పరిణామమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 12 తేదీ వరకు ప్రధాన దేవాలయాల్లో దసరా విజయీభావ శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

ఉండి: ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని భీమవరం ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ కే నాగార్జున అధ్యక్షతన ఖరీఫ్ 2024–25 సీజన్‌కు గాను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధరలు సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2300, ఏ గ్రేడ్ రకం రూ.2320 ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఏడీఏ కే శ్రీనివాస్, తహసీల్దార్ కే నాగార్జున, సీఎస్‌డీటీ మహేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి బీ సంధ్య, ఎస్ చిన్నారావు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

కాళ్ల: ఖరీఫ్‌లో పండిన ప్రతి వరిగింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరాంప్రసాద్ అన్నారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం రైతుసేవా కేంద్రంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆకివీడు ఏడీఏ శ్రీనివాసరావు, తహసీల్దార్ జి.సుందర్ సింగ్, ఏఓ జయవాసుకి పాల్గొన్నారు.


ఉండిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

ఆకివీడు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని సిద్ధం చేసినట్లు ఏడీఏ కె.శ్రీనివాస్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో శనివారం ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారిణి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేడు కుట్టుమిషన్ల పంపిణీ

భీమవరం: కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు, సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో 70 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేయనున్నట్లు కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (కోపా) అధ్యక్ష, కార్యదర్శులు యర్రంశెట్టి హరనాధరావు, ఆరేటి సత్యనారాయణ చెప్పారు. శనివారం భీమవరంలో వివరాలను వెల్లడించారు. ఆదివారం స్థానిక కోపా కల్యాణ మండపంలో నిర్వహించే కాపు సమ్మేళనం జిల్లా సదస్సులో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్
90102 23729
79955 66351
90108 51166
Office mail : tpgadvt@gmail.com